## రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ జూడోకు ఎంపిక



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ జూడో అండర్-14 గ్రూప్‌లో శ్రీకాకుళం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థి ఎస్.లవకుమార్ రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ జూడో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు తెలిపారు. సీతంపేట ఐటిడిఏ పీవో, జిల్లా గిరిజన, సహాయ గిరిజన సంక్షేమ అధికారిణి, డిప్యూటీ డీఈవోలు అభినందించారు. ఈ నెల 21న తిరుపతిలో రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటాడు.







సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 18-9-2024

సంపుటి: 20 సంచిక: 150

పేజీలు: 4 వెల: రూ.1







# ఎందుకిట్లా ఆడుకున్నావ్ రాధికా!



- ఆధారాలిచ్చినవారిని అరెస్ట్ చేశారు
- డీజీ స్థాయి అధికారి చెప్పారని కథ మార్చేశారు
- విచారణ మధ్యలో తప్పుకున్న సీఐ
- కామేశ్వరరావుతో కుదిరిన డీల్
- ఆర్‌ఎం రాజును ఇప్పటికీ విచారించని వైనం
- గార ఎస్‌బీఐ కుంభకోణంలో జెత్వానీ కేసు పోలికలు



**గత ప్రభుత్వంలో ఉన్నత పదవుల్లో ఉన్న పోలీసులంతా రాష్ట్రవ్యాప్తంగా ఒకేలా వ్యవహరించారా? అంటే.. అవుననడానికే ఆధారాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కేవలం వ్యక్తి ప్రయోజనం కోసం వ్యవస్థలను కుళ్లబొడిచేసి సొమ్ములు చేసుకొని వెళ్లిపోయినట్లు అర్థమవుతుంది. రోజా సినీ నటి జెత్వానీ కేసును చదువుతుంటే పెద్ద పెద్ద ఐపీఎస్ అధికారులు ఇంత చిన్న లాజిక్‌ను మర్చిపోయి ఎందుకు క్రైమ్‌కు పాల్పడ్డారన్నదే మిలియన్ డాలర్ల ప్రశ్న. ఒక పారిశ్రామికవేత్త కోసం ఉన్నత పోలీసు అధికారి జెత్వానీ మీద కేసు పెట్టి అరెస్ట్ చేసినట్లే ఒక బ్యాంకు అధికారి కోసం మరో పోలీసు డీజీ స్థాయి అధికారి చెప్పారని ఇక్కడి పోలీసులు దొంగకేసులు పెట్టి అరెస్ట్ చేశారు. అక్కడా తెర వెనుక కథ నడిపింది పోలీసు పెద్ద తలకాయే. ఇక్కడ కథలోనూ కీలక పాత్ర పోలీసు డీజీ స్థాయి వ్యక్తిదే.**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జెత్వానీ కేసులో నాణేనికి రెండు ముఖాలు ఉన్నట్టు గార ఎస్‌బీఐ కేసులో అసిస్టెంట్ మేనేజర్ ఆత్మహత్య వెనుక కూడా రెండు కోణాలు ఉన్నాయి. తాకట్టు బంగారం లాకర్‌లో ఉండాల్సింది మాయం కావడంతో పోలీసులు దర్యాప్తు జరిపి



దోషులను శిక్షించి బాధితులకు న్యాయం చేకూర్చాల్సిందిపోయి, తన కూతురు ఆత్మహత్యకు బ్యాంకులో నగలు మాయమవడమే కారణమని స్వయంగా అప్పటి ఎస్పీకి ఫిర్యాదు చేసిన స్వప్నప్రియ తల్లినే పోలీసులు వేధించిన విషయం ఇప్పుడు జెత్వానీ కేసు సందర్భంగా వెలుగులోకి వచ్చింది. ముంబయి నటి జెత్వానీ కేసులో ముగ్గురు ఐపీఎస్ అధికారులు ఏం చేశారో, శ్రీకాకుళంలో స్వప్నప్రియ ఆత్మహత్య కేసులో కూడా ఇక్కడి పోలీసులు అదే పని చేశారు. జాతీయ మానవహక్కుల కమిషన్‌కు, ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లిన తర్వాత జరుగుతున్న దర్యాప్తులో అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గార ఎస్‌బీఐలో తాకట్టులో ఉన్న బంగారు నగలు మాయమైన మాట వాస్తవమని, ఆ బ్యాంకుకు అసిస్టెంట్ మేనేజర్‌గా స్వప్నప్రియ పని చేస్తుందని, లాకర్‌లో ఉండాల్సిన నగలు ఎక్కడ ఉన్నాయో తనకు తెలుసని, ఎవరెవరు తాకట్టుపెట్టారో కూడా ఆధారాలు సంపాదించానని అప్పటి ఆర్‌ఎం టీఆర్‌ఎం రాజు సూచన మేరకు కొంత బంగారాన్ని విడిపించి బ్యాంకుకు అందజేశానని, మిగిలిన అన్ని వివరాలు చనిపోయిన స్వప్నప్రియ ఫోన్‌లో ఉన్నాయంటూ స్వప్నప్రియ సోదరుడు కిరణ్ అప్పటి ఎస్పీ గ్రీవెన్స్‌కు వెళ్లి నేరుగా ఆధారాలన్నీ సమర్పిస్తే దాని మీద విచారణ జరపాల్సిన పోలీసు అధికారులు అక్కడికి 24 గంటల్లో కిరణ్‌ను పట్టుకెళ్లి లోపలేశారు. అలా అని ఆయన బ్యాంకు నుంచి బంగారం తీసుకువెళ్లాడన్న

- మిగతా 4లో

## సహారా బాధితుల సంఘం వినతి



(సత్యంన్యూస్, టెక్కలి)

శ్రీకాకుళం జిల్లా సహారా ఇండియా బాధితుల సంఘం కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణిని బుధవారం క్యాంప్ కలిసి వారి సమస్యలపై వినతిపత్రం అందించారు. గత కొన్నేళ్లుగా తాము పడుతున్న సమస్యలకు కాంగ్రెస్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ద్వారా న్యాయం జరిగేలా కృషి చేయాలని వారు కోరారు. దీనిపై కృపారాణి మాట్లాడుతూ తప్పకుండా ఈ అంశం పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, టి.బి.జె.గుప్త, సహారా బాధిత కమిటి అధ్యక్షులు బైపల్లి సత్యరాజ్, గౌరవాధ్యక్షులు బోయిన సత్యనారాయణ, సెక్రటరీ మాధవరావు, వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

### అలాంటి విద్యాసంస్థలు
## సీజ్ చేయండి

(సత్యంన్యూస్, టెక్కలి)


ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా విద్యాసంస్థలు నడిపిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో వై.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. హరిపురంలోని కైజన్ స్కూల్ ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా అర్హత లేని టీచర్స్‌ని పెట్టుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజక వర్గ అధ్యక్షులు పవన్, జస్వంత్, మనీ తదితరులు పాల్గొన్నారు.






# ఐఏఎస్ లెక్క.. బోర్డ్ తిప్పేసింది పక్కా

### సిక్కోలులో మరో ఆర్థిక ఉగ్రవాదం




- కోట్లు మింగేసి పరారైన సంస్థ
- లబోదిబోమంటున్న ఖాతాదారులు

**" ప్రతిరోజు దేశంలో ఏదో ఒకచోట ఆర్థిక కలాపాలు నిర్వహించే సంస్థలు బోర్డు తిప్పేయడం సర్వసాధారణమైపోయింది. అధిక వడ్డీలకు, రిటర్న్స్‌కు ఆశపడి రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టి ఖాతాదారులుగా చేరి రూ.లక్షల్లో మోసపోతున్న వైనం అనేక సందర్భాల్లో వెలుగుచూశాయి. అధిక వడ్డీలను ఆశ చూపించి పెట్టుబడులను ఆకర్షించేలా ప్రకటనలు ఇస్తూ ఖాతాదారులను మోసం చేయడం అనేక ఏళ్లుగా సాగుతుంది. అదే కోవలో శ్రీకాకుళం నగరం కేంద్రంగా ఇండియా అడ్వర్టైజింగ్ సర్వీసెస్ (ఐఏఎస్) పేరుతో ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాల్లో సుమారు లక్ష మందికి టోకరా పెట్టి బోర్డు తిప్పేసింది. "**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో నాలుగు నెలలుగా కార్యకలాపాలు సాగించిన ఐఏఎస్ సంస్థ ఆన్‌లైన్‌లో ఐఏఎస్ యాప్‌లో పెట్టుబడి పెట్టించి రూ.కోట్లలో సొమ్ములు కొట్టేసారని ఖాతాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నగరంలోని ముద్దాడ చిన్నబాబు ఆసుపత్రి సమీపంలో ఇండియన్ బ్యాంకుపై అంతస్తులో ఉన్న సంస్థ కార్యాలయం వద్దకు ఖాతాదారులు చేరుకొని అందోళన చేశారు. కార్యాలయంలో ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఫర్నిచర్‌ను ధ్వంసంచేసి చేతికి అందిన వస్తువులన్నింటినీ పట్టుకుపోయారు. ఈ సంస్థలో పెట్టుబడి పెట్టినవారిలో ఎక్కువమంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు ఉండడంతో కార్యాలయం వద్దకు వచ్చి వాకబు చేసి ఉసూరుమంటూ వెళ్లిపోతున్నారు.

జూలై 13న నగరంలో ప్రారంభించిన ఐఏఎస్ కార్యాలయంలో నగరానికి చెందిన కొండవీటి అన్నాజీరావును మేనేజర్‌గా నియమించి ఐఏఎస్ యాప్ వాలెట్ ద్వారా రూ.60వేలు జీతం చెల్లిస్తున్నట్టు తెలిసింది. ఈ కార్యాలయం తెరిచిన రెండు నెలలు మాత్రమే కార్యకలాపాలు నిర్వహించినట్టు ఖాతాదారులు చెబుతున్నారు. మేనేజర్‌గా వ్యవహరించిన అన్నాజీరావు కూడా ఐఏఎస్ యాప్‌లో పెట్టుబడి పెట్టి ఇంకొందరితో పెట్టుబడి పెట్టించారని తెలిసింది. ఆ కారణంతోనే అన్నాజీరావును మేనేజర్‌గా నియమించి వేతనం చెల్లిస్తుందని విశ్వసనీయ సమాచారం.

### చెల్లింపులన్నీ వాలెట్ ద్వారానే

ఐఏఎస్ సంస్థ తన కార్యాలాపాలన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నట్టు ఖాతాదారులు చెబుతున్నారు. ఇందులో ఖాతాదారులను చేర్చినవారు వివిధ హోదాల్లో కమీషన్లు తీసుకుంటున్నారు. వీరు ఇచ్చిన వివరాల ప్రకారం ఐఏఎస్ సంస్థ ఆన్‌లైన్ బేస్డ్‌గా నిర్వహిస్తుంటారని తెలుస్తుంది. ఈ సంస్థకు సంబంధించిన యజమానులు ఎవరూ అందుబాటులో లేరని, కార్యాలయం ఏర్పాటు, ఫర్నీచర్ కొనుగోలు, నిర్వహణ ఖర్చులను వాలెట్ ద్వారానే ఐఏఎస్ సంస్థ చెల్లింపులు చేసినట్టు చెబుతున్నారు. కార్యాలయాన్ని అద్దెకు ఇచ్చిన భవన యజమాని నగరానికి చెందిన బాబ్జీ ఉద్యోగ రీత్యా విశాఖపట్నంలో నివాసం ఉంటున్నారు. భవన యజమానిని మేనేజర్‌గా పని చేస్తున్న అన్నాజీరావు సంప్రదింపులు జరిపి అద్దెకు తీసుకున్నట్టు తెలిసింది. భవన యజమానికి నెలవారీ అద్దెను ఐఏఎస్ వాలెట్ ద్వారానే చెల్లిస్తున్నారని తెలిసింది. ఈ సంస్థలో పట్టుబడి పెట్టేవారిని ఆకర్షించడం కోసం శ్రీకాకుళం కేంద్రంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్టు విశ్వసనీయ సమాచారం. పెట్టుబడిదారులను ఆకర్షించడానికి కమీషన్లు ఆశ చూపించి ఏజెంట్లుగా కొంతమందిని ఏర్పాటు చేసుకున్నారు. ఏజెంట్లుగా వారు చేర్చిన ఖాతాదారుల సంఖ్యను బట్టి హోదా ఇచ్చి కమీషన్ చెల్లిస్తుండడంతో వారంతా వారి సన్నిహితులు, కుటుంబ సభ్యులతో పెట్టుబడులు పెట్టించారు. రూ. 2,100, రూ. 5,500, రూ.18,300, రూ. 55 వేలు ఐఏఎస్ యాప్ ద్వారా జమ చేయించారు. ఐఏఎస్ యాప్‌లోకి ఎంటర్ అయిన తర్వాత వచ్చే ఛానల్స్‌లో ఖాతాదారుల నుంచి వసూలుచేసే మొత్తాన్ని జమ చేస్తుండేవారు. ఈ మొత్తం ఒక్కోసారి ఒక్కొక్కరి ఖాతాల్లో జమవుతుండేది. యాప్‌లో చాటింగ్ తప్ప నేరుగా సమాచారం ఇచ్చేవారు ఉండరని కమీషన్ ఏజెంట్లు జెబుతున్నారు.

ఆన్‌లైన్ లింక్ ద్వారా జమ

ఖాతాదారుల నుంచి జమ చేయించిన మొత్తాలను స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి వారంలో ఐదు రోజులకు వచ్చే లాభాలను ప్రతి వారం ఐఏఎస్ వాలెట్ ద్వారా ఖాతాదారులకు చెల్లింపులు చేస్తుంటారని ఏజెంట్లు చెబుతున్నారు. వారం చివరిలో ఐఎస్ యాప్ వాలెట్ ద్వారా వచ్చే రిటర్న్స్ విత్‌డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ విత్‌డ్రా చేసుకోకుంటే ఖాతాదారులకు రావాల్సిన మొత్తం వెనక్కి వెళ్లిపోతుంది. ఇందులో పెట్టుబడి పెట్టడానికి ఆసక్తి చూపించే వారికి మొదట ఒక లింక్ ఫోన్‌కు వస్తుంది. ఈ లింక్ క్లిక్ చేసి అందులో పేరు, చిరునామా, ఆధార్, బ్యాంకు అకౌంట్ వివరాలు ఇస్తే అందులో ఎంత పెట్టుబడికి ఎంత రిటర్న్స్ వస్తుందన్న వివరాలు కనిపిస్తాయి. ప్రతి విత్‌డ్రాకు 10 శాతం సర్వీస్ ఛార్జీలను వసూలు చేస్తున్నట్టుగా చూపిస్తారు. రోజులో ఒక్కసారి మాత్రమే ఒక ఖాతాదారుడు విత్‌గ్రా చేయడానికి అవకాశం ఉంటుందని చాటింగ్ ద్వారా సమాచారం ఇస్తారు. రూ.2,100 జమచేస్తే రోజకు రూ.75 చొప్పున ఏడాదికి 22,500, రూ.5,500కు రోజుకు రూ.200 చొప్పున ఏడాదికి రూ.60వేలు, 18,300కు రోజుకు రూ.600 రిటర్న్స్ ఏడాదికి రూ.1.98 లక్షలు రిటన్స్ వస్తాయని ఐఏఎస్ సంస్థ కమిషన్ ఏజెంట్ల ద్వారా ఖాతాదారులకు ఎరవేసి పెట్టుబడులు పెట్టించారు.

### ఖాతాదారులే ఏజెంట్లు

మొదట్లో పెట్టుబడి పెట్టినవారందరికీ సంస్థ చెప్పిన మాదిరిగా రిటర్న్స్ వారంలో వాలెట్ ద్వారా రావడం, వాటిని విత్‌డ్రా చేసుకోవడంతో వీరంతా ఏజెంట్లుగా మారిపోయి ఖాతాదారులను చేర్పించి కమీషన్లు పొందడం ప్రారంభించారు. దీంతో ఎంతమంది ఖాతాదారులను తీసుకువస్తే అంత ఆదాయం రావడం, సంస్థ హోదా కట్టబెట్టడంతో ఐదు జిల్లాల్లో సుమారు లక్షమంది దీనిలో పెట్టుబడులు పెట్టారు. మొదట 10 మందిని చేర్చితే ఇన్‌టైమ్స్ అసిస్టెంట్‌గా, 20 మందిని చేర్చితే ఫార్మల్ అసిస్టెంట్‌గా, 100 మందిని చేర్చితే ఫార్మల్ సూపర్‌వైజర్‌గా, 300 మందిని చేర్చితే మార్కెటింగ్ మేనేజర్‌గా, 600 మందిని చేర్చితే రీజనల్ మినిస్టర్‌గా, 3వేల మందికి చేర్పిస్తే రీజనల్ పార్టనర్‌గా హోదాలు కట్టబెట్టి రూ.5 వేల నుంచి రూ.10లక్షలు నెలవారీ కమిషన్లు ఇవ్వజూపారు. మొదట్లో చేరిన, చేర్చుకున్నవారికి ప్రతి వారం వాలెట్ ద్వారా రిటన్స్ రావడంతో వారంతా అత్యాశకు పోయి చిన్న మొత్తాలు జమ చేసిన వారంతా రూ.18,300, రూ.55వేలు జమచేయడం ప్రారంభించారు.

### కార్యాలయంలో చొరబడి

జమ చేసిన వారి సంఖ్య అమాంతం పెరగడం, తక్కువ మొత్తాలు కట్టిన వారికే రిటర్న్స్ రావడంతో పెద్ద మొత్తం కట్టేవారిని మరి కొన్నాళ్లు వేచి ఉండాలని యాప్ ద్వారా సమాచారం ఇవ్వడంతో నెల రోజుల పాటు అందరూ వేచిచూశారు. ఆతర్వాత ఎవరిని సంప్రదించాలో తెలియక ఐఏఎస్ యాప్‌లో చాటింగ్ చేసినా ఎవరూ స్పందించకపోవడంతో జిల్లా కేంద్రంలో ఉన్న కార్యాలయానికి రావడం ప్రారంభించారు. కార్యాలయంలో ఉన్న మేనేజర్ అన్నాజీరావును సంప్రదించగా, ఆయన సమాధానం చెప్పలేక ఫోన్ స్విచాఫ్ చేసి కార్యాలయానికి తాళం వేసి వెళ్లిపోయారని తెలిసింది. వారం రోజులుగా కార్యాలయానికి తాళం వేసి ఉండడం, సమాధానం చెప్పేవారు లేకపోడం, ఎవరిని సంప్రదించాలో తెలియక కార్యాలయం తాళాలు పగలుగొట్టి చొరబడి మరుగుదొడ్డి డోరుతో సహా పట్టుకుపోయారు. నేరుగా డబ్బులు ఇవ్వకపోవడం, ఫోన్ల నుంచే ఫోన్‌పే ద్వారా చెల్లింపులు చేసి వాలెట్ ద్వారా విత్‌డ్రాలు చేసుకోవడంతో ఎవరిపై ఫిర్యాదు చేయాలో తెలియక బాధితులు తలలు పట్టుకుంటున్నారు. కమీషన్ ఏజెంట్ల ద్వారా పెట్టుబడిని నేరుగా సొంత ఫోన్ ద్వారా బాధితులు చెల్లింపులు చేయడం వల్ల తమకు సంబంధం లేదని, తామూ బాధితులమేనంటూ ఎదురు తిరుగుతున్నారని బాధితులు చెబుతున్నారు.

• ఎడిటోరియల్

# బీజేపీ అంచనాలకు అందని కేజ్రీవాల్

బీజేపీ ఒకటనుకుంటే దానికి అనూహ్యంగా కేజ్రీవాల్ స్పందిస్తుంటారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కేజ్రీవాల్ అరెస్ట య్యారు. ఆర్నెళ్లు జైలుకెళ్లారు. జైలుకెళ్లక ముందు నుంచే ప్రిపేర్ చేశారు. మనీస్ సిసోడియాను అరెస్ట్ చేసిన దగ్గ ర్నుంటి తనను కూడా అరెస్ట్ చేస్తారు చూడండి అంటూ ముందు నుంచే ఒక వాతావరణాన్ని ప్రిపేర్ చేశారు. దీని ఉద్దేశం ప్రజల్లో ఇదొక కుంభకోణం కాదని, కేవలం రాజకీయ కక్షసాధింపేనని మైండ్ సెట్ చేయడం. వాస్త వానికి ఈ మాట బీజేపీ అనాలి కానీ ఆప్ ఈ నినాదాన్ని అందుకుంది. దీంతో అరెస్ట్ కావడంతోనే ఒక పబ్లిక్ ఒపీనియన్‌ను క్రియేట్ చేయగలిగారు. అరెస్టయిన తర్వాత కేజ్రీవాల్ రాజీనామా చేస్తారని బీజేపీ భావించింది. ఆమ్ ఆద్మీ పార్టీలో నాయకత్వ పోటీ, అంతర్గత కుమ్ములాటలు మొదలవుతాయని భావించింది. ఆప్ ముక్కచెక్కలై బలహీనపడుతుందని ఆనందించింది. పార్టీని సమైక్యంగా ఉంచడానికి ఎవరూ ఉండరని, కేజ్రీవాల్ జైలులో ఉండటం వల్ల ఆయన సతీమణి సునీతా కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెడతారని, అప్పుడు వారసత్వ రాజకీయాలంటూ ఆప్ మీద రాజకీయ దాడి చేయొచ్చని బీజేపీ ఆశలు పెట్టుకుంది. కేజ్రీవాల్ ఇందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరించారు. జార్ఖండ్‌లో ఇటువంటి అవినీతి ఆరోపణలే వచ్చినప్పుడు ముఖ్యమంత్రి హేమంత్ సూరన్ జైలుకు వెళ్లినప్పుడు రాజీనామా చేశారు. కానీ కేజ్రీవాల్ రాజీనామా చేయలేదు సరికదా.. బీజేపీకే కౌంటర్ సవాల్ విసిరారు. తాను రాజీనామా చేస్తే బీజేపీ చేసిన ఆరోపణలకు, పెట్టిన కేసులకు రాజకీయంగా బలం చేకూర్చినట్లవుతుందని ప్రకటించారు. ఆరు నెలలు జైలు నుంచే పాలించారు. జైలుకెళ్లిన ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని రాజ్యాంగంలో కూడా ఎక్కడా లేకపోవడంతో కేజ్రీవాల్‌ను గద్దె దించలేకపోయారు. దీంతో బీజేపీ అనునిత్యం కేజ్రీవాల్‌కు రాజకీయ వ్యామోహం ఎక్కువని, అందుకే జైలుకెళ్లినా రాజీనామా చేయలేదని ప్రకటిస్తూ వచ్చింది. అయినా కేజ్రీవాల్ పట్టించుకోలేదు. ప్రకటన చేయలేదు. కానీ జైలు నుంచి బయటకు వచ్చిన రెండు రోజుల్లోనే రాజీనామా చేశారు. దీని ద్వారా బీజేపీకి ఒక అవకాశం లేకుండా చేశారు. అధికార వ్యామోహం, కుర్చీని పట్టుకొని వేలాడుతున్నారు అని చెప్పుకొచ్చారు. ఇప్పుడు కేజ్రీవాల్ రాజీనామాతో ఈ ఆరో పణ చేసే అవకాశం బీజేపీకి లేకుండాపోయింది. పోనీ ఇప్పుడు రాజీనామా డ్రామా అని అందామంటే మొన్నటి వరకు అది బీజేపీ డిమాండే. తెలివిగా ఇప్పుడు కేజ్రీవాల్ రాజీనామా చేయడమే కాకుండా ఇప్పుడు జైలు నుంచి బయటకు వచ్చాక పార్టీ నాయకులందరితో మాట్లాడి అతీషీని ముఖ్యమంత్రిగా కూర్చోబెట్టారు. కేజ్రీవాల్ ఎప్పుడైతే రాజీనామా చేస్తారని ప్రకటించారో, ఆ స్థానంలో ఆయన భార్య వస్తుందని, మరో లాలూ–రాబ్రీ రాజ్యం వస్తుందని బీజేపీ ప్రచారం చేసింది. కానీ అనూహ్యంగా ఎమ్మెల్యేలను ఒప్పించి మరీ అతీషీని సీఎంను చేశారు. ఇది ఏ మాత్రం బీజేపీ ఊహించలేకపోయింది. అతీషీ మీద ఎటువంటి అవినీతి ఆరోపణ ఇంతవరకు చేయలేదు. పోటీ లో ఉన్న గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్, కైలాస్ గెహ్లాట్‌పైనే ఏదో ఒక రకమైన ఆరోపణలు బీజేపీ చేసింది. వీరిపై ఏదో ఒక కేసు పెట్టింది. కానీ ఇంతవరకు అతీషీ మీద ఇటువంటి ఆరోపణలేవీ చేయలేకపోయింది. అందువల్ల ఒక అవినీతి మంత్రిని ముఖ్యమంత్రిని చేశారని ప్రచారం చేసే అవకాశం బీజేపీకి లేకుండా చేసింది. మరోవైపు ఆమె మహిళ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి చదువుకొని వచ్చిన ఉన్నత విద్యావంతురాలు కావడంతో బీజేపీ పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. దీనివల్ల ఢిల్లీ ముఖ్యమంత్రి మీద టార్గెట్ చేసే అవకాశాన్ని బీజేపీ కోల్పోయింది. ఇప్పటికే ఆప్ నుంచి రెండు టెర్మ్‌లు ముఖ్యమంత్రిగా కేజ్రీవాల్ పని చేశారు. ఇప్పుడు మూడోసారి ఎన్నికకు వెళ్లాలంటే కచ్చితంగా ప్రజావ్యతిరేకత ఉంటుంది. ఇప్పుడు దాని నుంచి బయటపడటం కోసం కేజ్రీవాల్ వేసిన ఎత్తుగడ బీజేపీకి మింగుడుపడటంలేదు. కేజ్రీవాలే ముఖ్యమంత్రిగా కొనసాగితే రాష్ట్ర ముఖ్యమంత్రి అవినీతిపరుడని, బెయిల్ మీద ఉన్న ముఖ్యమంత్రి అని పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని బీజేపీ ప్రయత్నించింది. ఎందుకంటే.. రాహుల్‌గాంధీ విషయంలో కూడా ఇదే ప్రచారం చేసింది. ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయి తనను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని సానుభూతిని పొందడానికి కేజ్రీవాల్ కొత్త అస్త్రాన్ని సిద్ధం చేసుకున్నట్లయింది. బీజేపీ అంచనాలకు అందకుండా కేజ్రీవాల్ వేస్తున్న ఎత్తులు కేంద్ర ప్రభుత్వా నికి మతులు పోగొడుతున్నాయి. ఇలాంటి విషయాల్లో కేజ్రీవాల్‌ది మొదట్నుంచి ప్రత్యేక శైలి. 2013లో ఇండియా ఎగెనెస్ట్ కరప్షన్ పేరుతో అన్నా హజారే చేసిన దీక్షను కేజ్రీవాల్ జాగ్రత్తగా తనకు అనుకూలంగా మలుచుకు న్నారు. అప్పటికే ఢిల్లీలో షీలాదీక్షిత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అనేక ఏళ్లు గడిచిపోవడంతో ప్రజా వ్యతిరేకత ను తమకు అనుకూలంగా మలచుకోవాలని బీజేపీ భావించింది. కానీ కేజ్రీవాల్ బీజేపీ తర్వాత స్థానంలో నిలి చారు. ఇక్కడ హంగ్ ప్రభుత్వం ఏర్పడటంతో కాంగ్రెస్ ముందు 30 డిమాండ్లు ఉంచి వారి దగ్గర ఉన్న ఎమ్మెల్యే లతో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి అక్కడికి కొద్ది రోజుల్లోనే ప్రభుత్వాన్ని రద్దు చేసి బీజేపీ, కాంగ్రెస్ కలిసి ఆప్ ప్రభు త్వాన్ని నడపనివ్వడంలేదని ఎన్నికలకు వెళ్లాయి. దీంతో ఆప్‌కు ఏకపక్ష మెజార్టీ ఇచ్చి గెలిపించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కూడా ఆప్ వరుసగా రెండోసారి గెలిచింది. మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరంలో ఉంటానని తన పిల్లల మీద ఒట్టేసి చెప్పిన కేజ్రీవాల్ ఆ తర్వాత వేసిన ఎత్తుగడ బీజేపీకి, కాంగ్రెస్‌కు మతి పోయేటట్టు చేసింది. ఇప్పుడు కూడా రాజీనామా సమర్పించి హర్యానా, ఢిల్లీ, పంజాబ్‌లలో పార్టీ కోసం కేజ్రీవాల్ బలాన్ని కూడగడతారు. ఈలోగా బీజేపీ పరిభాషలోనే అగ్నిపరీక్షలో పునీతుడుగా తేలిన తర్వాతే ముఖ్యమంత్రి పదవిని అధిష్టిస్తానని కేజ్రీవాల్ చెప్పుకొచ్చారు.

## పాఠశాల సముదాయాలు విజ్ఞాన వేదికలు




(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల పాఠశాల సముదాయ సమావేశం బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయ కార్యదర్శి బాడాన రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల సముదాయ చైర్మన్ పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విజ్ఞానంను పంచుకునే అద్భుతవేదిక పాఠశాల సముదాయ సమావేశాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు సమ సమాజ నిర్మాతలని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బృహత్తర బాధ్యత వారి భుజస్కంధాలపై ఉందన్నారు. పాఠశాల సముదాయ కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ సామాజిక స్పృహ, నైతిక విలువలను జోడించి పాఠాలతోపాటు జీవిత పాఠాలు బోధించి విద్యార్థుల మనసులను గెలుచుకొనే ఛాంపియన్ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడన్నారు. ఆధునిక బోధనా పద్ధతుల ద్వారా సాంకేతికతను జోడించి ప్రతి ఉపాధ్యాయుడు బోధించాలని రాజు సూచించారు.

ఏపిటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. వినూత్న బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు కె.తవిటిరెడ్డి, విష్ణు, చందన రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సముదాయ చైర్మన్ పి.రామకృష్ణ, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరమ్ జిల్లా ప్రధానకార్యదర్శి బాడాన రాజు, ఏపిటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, ఉపాధ్యాయులు కె.తవిటిరెడ్డి, టి.చందన రావు, అట్ల విష్ణు, కె.లక్ష్మీనారాయణ, సామ సంజీవరావు, బి.పాపారావు, జనార్ధన రావు, తిరుమలరావు, మీనా, శివ జ్యోతి, అరుణకుమారిలు పాల్గొన్నారు.




కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణిని సహారా ఇండియా బాధితుల సంఘం ప్రతినిధులు టెక్కలిలో గల ఆమె క్యాంపు కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యలను కాంగ్రెస్ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీకి వివరించి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, టి.బి.జె. గుప్త, సహారా బాధిత కమిటి అధ్యక్షులు బైపల్లి సత్యరాజ్, గౌరవాధ్యక్షులు బోయిన సత్యనారాయణ, సెక్రటరీ మాధవ రావు, వరప్రసాద్‌లు పాల్గొన్నారు. – సత్యంన్యూస్, టెక్కలి



కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్‌నాయుడును విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాదరావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.
– సత్యంన్యూస్, శ్రీకాకుళం



ఆసియా–పసిఫిక్ దేశాల చైర్మన్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ మాదిగ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రమణమాదిగ మాట్లాడుతూ రామ్మోహన్‌నాయుడుకు కేంద్రమంత్రితోపాటు ఆసియా–పసిపిక్ దేశాల చైర్మన్‌గా చిన్నవయసులో అవకాశం రావడం ఆనందదాయకమన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు.
– సత్యంన్యూస్, శ్రీకాకుళం



# శ్రీలీల చేతికి కెరీర్ బిగ్గెస్ట్ ఆఫర్!

తెలుగు ప్రేక్షకులకు కొత్త 'పెళ్లి సందడి' సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. తెలుగు మూలాలు ఉన్న ఈ అమ్మడు కన్నడ సినిమా ఇండస్ట్రీలో మొదటి ఎంట్రీ ఇచ్చింది. అక్కడ రెండు మూడు సినిమాల్లో నటించిన శ్రీలీలకు టాలీవుడ్ నుంచి రాఘవేంద్ర రావు రూపంలో పిలుపు వచ్చింది. మొదటి సినిమా నిరాశ పరిచిన ఆ తర్వాత వచ్చిన ఆఫర్లు, సక్సెస్ ల కారణంగా టాలీవుడ్ లో టాప్ స్టార్ హీరోయిన్ గా మారింది. ప్రస్తుతం టాలీవుడ్ లో రవితేజ తో ఒక సినిమా, పవన్ కు జోడీగా ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాతో పాటు మరో రెండు సినిమాల్లో నటిస్తోంది. మరికొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. టాలీవుడ్‌లో బిజీ బిజీగా సినిమాలు చేస్తున్న శ్రీలీల మరో వైపు కోలీవుడ్, కన్నడ సినిమా ఇండస్ట్రీల్లో సినిమాలను చేసేందుకు ఆసక్తి చూపిస్తుంది. శ్రీలీల చేతిలో ప్రస్తుతం ఉన్న పెద్ద సినిమాలకు తోడు కెరీర్ లోనే అతి పెద్ద సినిమాను ఆమె కమిట్ అయిందనే వార్తలు వస్తున్నాయి. తమిళ్ సూపర్ స్టార్ అజిత్ కుమార్ తో ఒక సినిమాలో నటించే అవకాశం ఈ అమ్మడికి దక్కింది. ప్రస్తుతం అజిత్ నటిస్తున్న రెండు సినిమాలు విడా ముయార్చి, గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలు సమాంతరంగా షూటింగ్ జరుగుతున్నాయి. ఆయనకు జోడీగా ఒక సినిమాలో శ్రీ లీలను నటింపజేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తమిళ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

తమిళ్ లో శ్రీలీల మొదటి సినిమాతోనే ఏకంగా సూపర్ స్టార్ సినిమాలో నటించే అవకాశం రావడం గొప్ప విషయం. ఇప్పటి వరకు ఈ విషయమై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అజిత్ మూవీ లో శ్రీలీల హీరోయిన్ గా నటించబోతుందా లేదంటే.. ఆయన సినిమాలో ఐటెం సాంగ్ ను ఏమైనా చేయనుందా అంటూ ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. శ్రీలీల ఈ విషయాన్ని గురించి క్లారిటీ ఇచ్చే వరకు పుకార్లు షికార్లు చేస్తూనే ఉంటాయి. అజిత్ సినిమాలో కనీసం ఐటెం సాంగ్ లో కనిపించినా కోలీవుడ్ లో మంచి గుర్తింపు దక్కి, ఆ తర్వాత వరుసగా సినిమాల్లో నటించే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. శ్రీలీల ఇప్పటి వరకు చేసిన సినిమాల్లో మహేష్ బాబు తో చేసిన గుంటూరు కారం పెద్ద మూవీ గా చెప్పుకోవచ్చు. అయితే ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద బొక్క బోర్లా పడటంతో ఇప్పుడు ఆమె చేయబోతున్న అతి పెద్ద మూవీ అజిత్ తో అనే టాక్ వినిపిస్తుంది. ఈ మధ్య కాలంలో శ్రీలీల సినిమాల సంఖ్య కాస్త తగ్గించింది. గత ఏడాదితో పోల్చితే సినిమాలు ఎక్కువగా చేయడం లేదు అంటూ ఫ్యాన్స్ మాట్లాడుకుంటూ ఉన్నారు. అయినా రాబోయే ఏడాది కాలంలో శ్రీలీల నుంచి మూడు లేదా నాలుగు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. నెట్టింట శ్రీలీలకు ఉన్న ఫాలోయింగ్ నేపథ్యంలో ఆమెకు సంబంధించిన ప్రతి చిన్న విషయం, ఫోటో వైరల్ అవ్వడం కామన్ అయింది. ఇప్పుడు అదే తీరుతో అజిత్ తో మూవీ వార్తలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. అసలు విషయం ఏంటనేది చూడాలి.



– తుపాకి.కామ్ సౌజన్యంతో...

విద్యాబాలన్ మంచినటి.. వీసమెత్తు సందేహం లేదు. ఆమె హఠాత్తుగా ప్రఖ్యాత గాయని ఎంఎస్ సుబ్బులక్ష్మి జయంతి సందర్భంగా ఓ ఫోటో షూట్ చేయడం, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ఆసక్తి రేపుతోంది. విశ్వ స్వరవీథుల్లో భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని వినిపించిన ఆమెది పరిపూర్ణ, సార్థక జీవనం. ఆమె కథ ఖచ్చితంగా ఓ బయోపిక్ చిత్రానికి అర్హం. ఆమె కథ సినిమా కథల్ని మించిన కథ. ఈమధ్య కొన్నాళ్లుగా బాలీవుడ్ నిర్మాతలు ఎవరో సుబ్బులక్ష్మి బయోపిక్ తీయాలని సంకల్పించినట్టు వార్తలొచ్చాయి. నిజానికి బాలీవుడ్ దాన్ని సరిగ్గా ప్రజెంట్ చేయలేదేమోననీ, కోలీ వుడ్ మాత్రమే ఆ సబ్జెక్టును సరిగ్గా డీల్ చేయగలదనీ అభిప్రాయాలు కూడా వచ్చాయి. ఒకింత నిజమే అనిపిస్తుంది. అవును, ఒక స్మితతాలూకు డర్టీ పిక్చర్ వేరు, ఒక సుబ్బులక్ష్మి కథ వేరు..సుబ్బులక్ష్మి సంగీతంలోని ఆత్మను పట్టుకోవాలంటే అది బాలీవుడ్‌తో కాదు. సరే, ఆ వార్తలు రాగానే ఆ సినిమాలో కీర్తిసురేష్ నటిస్తుందనీ వినిపించింది. తను ఆ పాత్రలో ఇమడగలదానే సందేహాలు కూడా ఉన్నాయి. తను ఆ పాత్రను చేయగలదు, కానీ తనకన్నా విద్యాబాలన్ బెటర్ అనే అభిప్రాయాలూ ఉన్నాయి. విద్యాబాలన్‌కు కూడా ఆ ఆశ ఉంది. ఆ పాత్ర చేయాలని.. తను విపరీతంగా అభిమానించే సుబ్బులక్ష్మి పాత్ర తన లైఫ్ యాంబిషన్ అన్నట్టుగా తరచూ చెబుతుంది కూడా..



# విద్యాబాలన్..మార్కెటింగ్ స్ట్రాటజీ...

# డర్టీపిక్చర్ టూ సుబ్బులక్ష్మి!

ఎస్, ఈ ఫోటో షూట్ కూడా ఆమె ఆలోచనను, ఆమె సంకల్పాన్ని బయటపెట్టడం కోసమే అన్నట్టుగా ఉంది ఏమో, డర్టీ పిక్చర్‌లో చేసినందుకు ఎక్కడో ఏ మూలో కాస్త గిల్టీ ఫీల్ ఉన్నట్టుంది. (నిజానికి అవసరం లేదు, ఆ పాత్రను పాత్ర తత్వానికి తగినట్టు బాగా పర్‌ఫామ్ చేసిందామె..) దాన్ని చెరిపేసుకోవడానికి కూడా సుబ్బులక్ష్మి పాత్ర ఉపయోగపడుతుం దనే భావన ఏదో కనిపిస్తోంది, అప్పట్లో ఆ పాత్రను ఆమె చేయడం మీద నెగెటివ్ విమర్శల్ని కూడా భారీగానే ఎదుర్కొంది ఆమె (స్మిత కథను కూడా కమర్షియల్ నిర్మాతలు ఎక్స్‌ప్లాయిట్ చేశారనే విమర్శలు కూడా..) అవన్నీ విద్య ఎలా మరిచిపో గలదు..?

"చిన్నప్పటి నుంచీ ఆమె పాడిన సుప్రభాతం వింటూ లేచాం, ఆమె పాటలు వింటూ పెరిగాం, ఆమె గొంతులో ఆమె గానంలో ఏదో తెలియని ఆధ్యాత్మిక శక్తి ఉంది. ఈ ఫోటోలు ఆమెకు నివాళులర్పించడం మాత్రమే" అంటోంది విద్యాబాలన్. కాదు, అంతకుమించి ఏదో ఆశ, ఏదో ప్రయత్నం.. తన సన్నద్ధతను, తన ఇష్టాన్ని నిర్మాతలకు ఇలా తెలియపరుస్తోంది ఆమె.,

ఐదారు ఫోటోలు..అచ్చంగా సుబ్బులక్ష్మి ఆహార్యంతో ఉన్నయ్ ఫోటోలు. నిజంగా ఆమె ఆ పాత్రను సరిగ్గా నప్పుతుంది అన్నట్టుగా ఉన్నాయి. మొహంలో ఆ ప్రశాంతత, ఆ నిండుతనం కనిపిస్తున్నాయి. "సుబ్బులక్ష్మి చీరలు స్పెషల్, అవి ఆమె హుందాతనానికి నిండుతనం తీసుకొస్తాయి" అంటుంది విద్యబాలన్.

అందుకే అచ్చంగా సుబ్బులక్ష్మిని పోలినట్టే రెండు ముక్కుపుడకలు, కొప్పు, మల్లెపూలు, రెండు బొట్లు, భుజాలపై నుంచి పైట.. భారతీయ స్త్రీ మూర్తి ఆమె.. సుబ్బులక్ష్మి మనమరాలి సహకారం కూడా తీసుకుని అలాగే తయారైంది. మనసులో ఆ తాదాత్మ్యతను నింపుకుని మరీ కనిపిస్తోంది విద్యాబాలన్.. ఆమె ఇన్‌స్టా పోస్టుకు ఐదున్నర లక్షల లైకులు, 6500 కామెంట్లు.. అందులో అధిక భాగం ఆమే ఆ పాత్రకు అర్హురాలు అని చెబుతున్నాయి.. విద్యాబాలన్ మంచి నటి మాత్రమే కాదు, తెలివైన మార్కెటింగ్ స్ట్రాటజిస్టు కూడా..!!

– ముచ్చట సౌజన్యంతో...




# ఒక్క రూపాయి నోటు..
# ఓ నోస్టాల్జియా!

నాణాల నుంచి కాగితంపైకి కరెన్సీ మారిన కాలాన్ని ఓసారి గుర్తు చేసుకుందాం. నాడు అదో రెవల్యూషన్. ఓ పెద్ద మార్పు. నోస్టాల్జియా. కరెన్సీ చలామణిని సులభం చేసిన కాలం. ఇవాళ కాగితం కరెన్సీ చలామణిలో ఉన్నా.. డీమానిటైజేషన్ పుణ్యమా అని డిజిటల్ కరెన్సీకే అలవాటు పడుతున్న వేళ.. కాగితంపైకెక్కిన ప్రగతిశీల కరెన్సీ కథలెలా మారాయో తెలుసుకునే కథ ఇది. సంప్రదాయ రూపాయి నోటు.. క్రొంగొత్త ఐడియాస్, ల్యాండ్ మార్క్స్, మొక్కలు, జంతువుల పిక్చర్స్‌తో ఎలా న్యూలుక్ సంతరించుకుందో ఓసారి నెమరువేసుకుందాం!

నోటంటే కేవలం కాగితమే కాదు, అలా అని డబ్బు మాత్రమే కాదు, అంతకుమించి! పిల్లలు, పెద్దలు, జెండర్ తేడా లేకుండా మనుషులందరికీ అవసరమైన కాగితం!! మన సంస్కృతిలో భాగం! వయస్సుతో తేడా లేకుండా జనరేషన్స్‌ను కలిపే ఓ ఎమోషన్!! జేబులో, పాకెట్‌లో మనీ ఉంటే.. అది అందమైన జ్ఞాపకాలను అందిస్తుంది. అయితే, ప్రస్తుతం ప్రపంచమంతా డిజిటల్ మనీగా మారుతున్న కాలాన మనం చూసిన పూర్వపు రూపాయి నోటు రేపటి తరానికి తెలియకపోవచ్చునేమో గానీ అది తెలిసినవారందరికీ ఓ మధుర జ్ఞాపకం. నాణేనికి మరోవైపు రూపాయి నోటు తెచ్చిన ఆర్థిక తారతమ్యాలు కూడా చర్చించాల్సినవే. అయితే, వాటిని కాస్త పక్కనబెట్టి రూపాయి పుట్టుక ఎలా జరిగిందనేదానిపై దృష్టి సారిద్దాం.

## కాలానుగుణంగా మారిన రూపాయి నోటు కథ!




రూపియే అనే పదం సంస్కృతంలోని రూపా నుంచి వచ్చింది. రూపా అర్థం వెండి నాణెం అని అట. చాణక్యుడు రచించిన అర్థశాస్త్రంలో వెండి నాణాలను రూప్యరూపగా సూచించారట. క్రీస్తుశకం 1540–1545 మధ్య షేర్ షా సూరి అనే రాజు వెండి నాణాన్ని విడుదల చేశారట. ఆ నాటి నాణాల వారసత్వమే ఇవ్వాల్టికీ మనం కొనసాగిస్తున్నాం. అయితే, 19వ శతాబ్దం చివరి వరకూ కూడా నాణాలే కరెన్సీగా చలామణి కాగా, ఆ తర్వాత వచ్చిన ఒక రూపాయి పేపర్ మనల్ని 20వ శతాబ్దం ఆరంభంలోని చరిత్రలోకి తీసుకెళ్లుతుంది.

### భారతీయ ఆర్థిక చరిత్రకు కొత్త రూపు

ఒక రూపాయి నోటు కథ 20వ శతాబ్దపు ఆరంభానికి మనల్ని తీసుకెళ్తుంది. ఇది భారతదేశ ఆర్థిక ప్రగతిశీల పరిణామంలో ఒక ముఖ్య ఘట్టం, ఓ మైలురాయి. బ్రిటీష్ వలసదారుల కాలంలో ఐకానిక్ రూపాయి నోటును కాగితంపై ముద్రించి కొత్త కరెన్సీని పరిచయం చేయడం ద్రవ్య లావాదేవీలను విప్లవాత్మకం చేసింది. రాజకీయ మార్పులు జరుగుతున్న కాలాన ఉద్భవించిన రూపాయి నోట్ ఆ తర్వాత ఆధునికీకరణ చెందింది. ఆర్థిక స్థిరత్వానికి బాటలు వేసింది. సంప్రదాయ వస్తు మార్పిడి వ్యవస్థలను సులభం చేయడంతో పాటు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది.




స్టాంప్స్, కరెన్సీస్, కాయిన్స్ వంటి చారిత్ర అంశాల గురించి తెలిపే మింటేజ్ వరల్డ్ సైట్ ప్రకారం మొట్టమొదటి నోటు 1861 నవంబర్ 30వ తేదీన ఇండియన్ పేపర్ మనీ యాక్ట్ ద్వారా వెలుగులోకి వచ్చింది. అయితే, మరింత ఆసక్తికరంగా, ప్రాధాన్యతతో కూడిన నోటును 1917, నవంబర్ 30న అప్పటి బ్రిటీష్ రాజైన ఐదో కింగ్ జార్జ్ కాలాన ప్రామిసరీ నోటులాగా విడుదల చేశారు.

### మొట్టమొదటి నోటుపై ఎవరి సంతకముంది..?

ఎంఎంఎస్ గుబ్బే మొట్టమొదటి రూపాయి కరెన్సీపై సంతకం చేశారు. ఆయనే కంట్రోలర్ ఆఫ్ కరెన్సీగా, ఇన్‌ఛార్జ్ ఆఫ్ ఇండిపెండెంట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కరెన్సీగా అప్పుడు పనిచేశారు. నాటి మొట్టమొదటి రూపాయి నోటుపై పైన మధ్యలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అని రాసుండేది. పైన ఎమడవైపు




కింగ్ జార్జ్ 5 చిత్రాన్ని చూపించే ఓ వెండి నాణెం కనిపించేది. మధ్యలో రోజ్ తరహా లైట్ పింక్ కలర్ డిజైనింగ్ ఉండేది. పైన కుడివైపు, కింద ఎమడవైపు 1 రూపాయిని సూచించే సంఖ్యలు కనిపించేవి. కింద భారత ప్రభుత్వాన్ని సూచించే సంతకముండేది.


ఇక వెనుక వైపు బ్రిటీష్ ఐదవ ఎంపరర్ అయిన జార్జ్ కింగ్ ముద్రను ప్రతిబింబించే జార్జియస్ రెక్స్ ఇంపరేటర్ డిజైన్‌తో పాటు పైన ఎడమవైపు ఐదవ జార్జ్ అధికారిక సాంకేతిక లిపి, కుడివైపు 1917లోని నాణానికి రెండోవైపు సూచించే చిహ్నం కనిపించేది నాటి మొట్టమొదటి రూపాయి నోటులో. మొత్తంగా ఐదవ కింగ్ జార్జ్ విడుదల చేసిన మొట్టమొదటి రూపాయి కరెన్సీ సరళంగా, అందంగా కనిపించేదట.

### కాలానుగుణంగా మార్పులు!

అలా 1917 నుంచి రూపాయి కాగితపు నోటుగా చలామణిలోకి వచ్చాక ఆ కరెన్సీ రూపకల్పనలో కాలానికనుగుణమైన ఎన్నో మార్పులు వచ్చాయి. సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే నమూనాల నుంచి ఆధునిక భద్రతాపరమైన చర్యల వరకు డిజైన్స్ కొత్త రూపును సంతరించుకుంటూ వచ్చాయి. అలా జాతీయభావాలను పెంచేలా.. జాతీయ నాయకులను స్మరించుకునేలా.. స్వదేశీ కథలను చెప్పేలా.. వృక్షజాలాన్నీ, జంతుజాలాన్నీ తన ముద్రణలో కలుపుకుంటూ.. సంప్రదాయానికి, కొత్త ఆవిష్కరణలు తోడై రూపాయి నోట్లు.. కరెన్సీ చలామణికే పరిమితం కాకుండా.. ఎందరో సేకరించి పురా జ్ఞాపకాలుగా తమ వద్ద పెట్టుకునే అపురూపమైన వస్తువుగా కూడా తయారవ్వడం విశేషం.

### రూపాయి నోటుకెందుకంత ప్రాధాన్యత?

రూపాయి నోటంటే కేవలం ద్రవ్య వినిమయం కిందకు వచ్చే ఓ




వస్తువుగా ఏనాడూ చూడబడలేదు. అంతకుమించి దేశంలో రూపాయి తన విలువను పెంచుకుంది. రోజూవారీ లావాదేవీలకు పనిచేసే రూపాయి.. ఆధ్యాత్మక, మతపరమైన అంశాల్లో దక్షిణగా ఇవ్వడానికో.. లేక ఫండ్ రైజింగ్ చేసినప్పుడు మినిమంగానైనా ఇవ్వడానికో ఉపయోగపడుతూ వచ్చింది. అలా కేవలం కరెన్సీగానే కాకుండా.. అంతకుమించిన బంధంతో రూపాయి జనాన్ని ఒకరితో ఇంకొకరిని మిళితం చేసింది.

### వారసత్వ సంపద సంరక్షణలో భాగంగా..

రూపాయి నోట్ ప్రారంభ దశ నుంచి అది చలామణిలో ఉన్న కాలం వరకూ కూడా రూపాయి నోట్లను సేకరించిన చరిత్ర ప్రియులెందరో కనిపిస్తారు. ఎందుకంటే వారికదో అభిరుచి. భారతదేశ ద్రవ్య వారసత్వ ప్రయాణంలో రూపాయి నోట్ల సేకరణ, చరిత్రను భవిష్యత్ తరాలకు చెప్పడమే కాకుండా.. తరతరాలుగా వివిధ మార్పులకు లోనవుతూ వచ్చిన ఆ నోట్లలోని తేడా కరెన్సీ కలెక్టర్లలో మరింత ఆసక్తికి కారణమైంది.

డిజిటల్ లావాదేవీల యుగంలో రూపాయి నోటు భవిష్యత్తుకు భరోసా లేకపోవచ్చు. అయినప్పటికీ, నేటి సాంకేతిక పురోగమనాల నడుమ కూడా అది కొనసాగిన ప్రస్థానం మాత్రం దాన్నెప్పటికీ గుర్తుండేలా చేస్తుంది. వడివడిగా పరుగులు పెట్టే కాలంలో దాని జ్ఞాపకాలను మాత్రం మర్చిపోకుండా ఈ సమాజంపై ముద్రించి ఫరెవర్ రీమైండర్‌గా రూపాయి నోటుది ఓ ప్రత్యేక స్థానం.

**- రమణ కొంటికర్ల**



బుధవారం జరిగిన శ్రీకాకుళం నియోజకవర్గ స్కూల్‌కాంప్లెక్స్ మీటింగ్‌లో శ్రీకాకుళం జిల్లా పి.ఈ.టి, పి.డి సెక్రటరీ సీనియర్ పి.డి సాంబమూర్తి పీఈ సిబ్బందికి టీషర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సలహాదారులు పి.సుందరరావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వీ.రమణ ఎస్.జీ.ఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, కె.మాధవరావు, ఎమ్.ఎస్.ఒ.గార, టి.శ్రీనివాసరావు, ఎమ్.ఎస్.ఒ. ఎం.తిరుపతిరావు, టేకి పురుషోత్తం, ఎన్టీఆర్ స్కూల్ హెచ్. ఎమ్.దేవదత్తానంద్ పాల్గొన్నారు. **– సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## చదువుతో పాటు క్రీడలలో రాణించాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

చదువుకున్న వయసులో చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో జరిగే క్రీడల్లో రాణించి మరింత పేరు ప్రఖ్యాతలు జిల్లా తీసుకురావాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 13 తేది నుంచి మూడు రోజులు అన్నవరంలో ఆంధ్రప్రదేశ్ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలో గెలుపొందిన క్రీడాకారులు మంగళవారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయంలో వారు ఎస్పీని గౌరవపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడల్లో మరింతగా రాణించాలని క్రీడాకారులు ఎస్పీ ప్రోత్సహించారు. జాతీయస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు బెండు జ్యోత్స్న, ఎన్.ప్రవీణ్, జి.ఛాయాకిరణ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఫిజికల్ డైరెక్టర్ మధు, బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



## మెరిసిన సిక్కోలు కుసుమాలు




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

మార్షల్ ఆర్ట్స్‌తో సంపూర్ణ ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు దోహదపడుతుందని శ్రీకాకుళం కరాటే చీఫ్ రెడ్డి ఢిల్లేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం స్థానిక మహాలక్ష్మినగర్ కోలనీలో గల కెన్యూ రియో కరాటే విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో బంగారు పతకాలతో మెరిసారని, స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్, కెంకో షోటోకన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో, ఆశీర్వాద కల్యాణమండపం, తాటిచెట్లపాలెం, విశాఖపట్నంలో జరిగిన పోటీలలో సత్తా చాటారన్నారు. ఇందులో భాగంగా జరిగిన పోటీలలో నగరానికి చెందిన కెన్యూ రియో విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించారని, కటా, కుమిటీలలో పతకాలను కైవశం చేసుకున్నారన్నారు. 13మంది విద్యార్థులు పాల్గొనగా, స్వర్ణం 08, రజతం 06, కాంస్యం 8తో 22 పతకాలు సాధించారన్నారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్‌ను మహాలక్ష్మినగర్ కాలనీ దగ్గర గల శ్రీ చైతన్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్యం అభినందించారు

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య అమరేంద్రకుమార్ బాధ్యతలు స్వీక రించారు. ఈ సందర్భంగా అమరేంద్రకుమార్‌ను డైరెక్టర్ బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, క్యాంపస్–2 ఇన్‌చార్జ్ సాగర్, ఫైనాన్స్ ఆఫీసర్ మోహనరావు, క్యాంపస్–3 ఇన్‌చార్జ్ సతీష్‌లు పాల్గొన్నారు.

**– సత్యంన్యూస్, శ్రీకాకుళం**



## స్వచ్ఛత హి సేవతో పంచాయతీలకు మహర్దశ

**(సత్యంన్యూస్, బూర్జ)**

కేంద్రప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛత హి సేవ కార్యక్రమంతో పంచాయతీలకు మహర్దశ కలుగనుందని బూర్జ వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు పేర్కొన్నారు. ఓ.వి.పేట సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో, అధికారులు, పాలకులు, సామాజికవేత్తలు, యువత, ప్రజలు అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛత, పరిశుభ్రత, తాగునీటి వనరుల అభివృద్ధి చేపట్టేవిధంగా కార్యక్రమం రూపొందించడం అభినందనీయమన్నారు. సర్పంచ్ అమ్మాజమ్మ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు అన్నివిధాలా చర్యలు చేపడుతున్నామన్నారు. కళింగ సంక్షేమ సేవా సంఘం జాతీయ గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రత పాటిస్తే ప్రజారోగ్యం పరిరక్షించబడుతుందన్నారు. టీడీపీ నాయకులు బి.వి.ఎస్. ఎన్.రాజు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య మెరుగు ప్రజలందరి బాధ్యతగా పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పంచాయితీ కార్యదర్శి ఉమకుమారి, సచివాలయం సిబ్బంది, గ్రామ పంచాయితీ అధికారులు, ఆశావర్కర్లు, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

SriAaKaSa
YOUR TRUSTED PARTNER IN THE DISTANCE EDUCATION SECTOR.
Join our Earn while Learn program and get a job within 40 days after joining.
LAST DATE: AUGUST-28
91330 06999 Courses 92466 36411
10th, Intermediate
BA (all groups), B.Com, BLiSc, B.SC (all groups),
BBA, BCA (with Market trending specialisations)
MA (all subjects), M. Com, MBA, MCA,
M. SC (All Subjects), MLiSc, M.Tech
Computer Applications, Cyber Security, Digital Marketing.
Hospital Management, Tourism Management

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

MNM
బెంగుళూర్ అయ్యంగార్
బేకరి
BSNL ఆఫీస్ ప్రక్కన, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
సెల్: 76759 18522

## ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నగరంలోని శ్రీసాయికృష్ణ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ నిర్వహించారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్నట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ప్రతి విద్యార్థి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమని పేర్కొన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్ ప్రమాదకరమని హెచ్చరించారు. మోటార్ బైక్ నడిపే ప్రతిఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్సై సుధాకర్ సూచించారు.



SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

జై శ్రీమన్నారాయణ
శ్రీ క్రిష్ణ ఆన్‌లైన్ సర్వీసెస్
మావద్ద అన్ని రకముల జాబ్ అప్లికేషన్స్ ఆన్‌లైన్ చేయబడును.
సెల్: 93938 41308
రైల్వే రిజర్వేషన్లు, బస్ రిజర్వేషన్ సదుపాయం కలదు.

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001




# 'ప్రింట్' పని సరి!



- డిజిటల్ వైపు మరలిన యువతరం
- ప్రపంచవ్యాప్తంగా పెద్ద ఎత్తున మూతపడుతున్న పత్రికలు
- ఆదాయం, ఆదరణ లేకపోవడమే కారణం!

ది ఆస్ట్రేలియన్ దినపత్రికకు ఈ ఏడాదికి అరవై ఏళ్లు. ప్రపంచంలోనే అతి పెద్ద మీడియా సామ్రాజ్యాన్ని నిర్మించిన రూపర్ట్ మర్డోక్ ఈ పత్రికను స్థాపించాడు. అరవయ్యవ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడుతూ మరో పదిహేనేళ్లలో ప్రింట్ పత్రికలు చనిపోనున్నాయని జోస్యం చెప్పాడు. ప్రపంచవ్యాప్తంగా ఒక్కొటొక్కటిగా పత్రికలు మూత పడిపోతున్న సమయంలో మర్డోక్ ఇలా ఊహించడం, ఆ పరిశ్రమపై ఆధారపడి బతుకుతోన్న జర్నలిస్టులకు పెనం మీద నుంచి పొయ్యిలోకి తోసినట్టనిపిస్తోంది. పరంపరానుగతంగా వస్తోన్న ప్రింట్ పత్రికలకు ఇది శరాఘాతంగా తగిలింది. గోరుచుట్టు మీద రోకటిపోటులాగా అన్ని దేశాలలో డిజిటల్ మాధ్యమానికి ప్రాబల్యం పెరగడం కూడా దినపత్రికలు కనుమరుగవడానికి కారణమవుతున్నాయి. బ్రిటన్‌కు చెందిన మీడియా విశ్లేషణ సంస్థ ఆఫ్‌కామ్ విడుదల చేసిన నివేదిక కూడా దీనిని ధృవపరుస్తోంది. 1960ల నుంచి వార్తల కోసం దినపత్రికల తర్వాత ఎక్కువగా ప్రజలు టీవీమీద ఆధారపడేవారు. ఇప్పుడు పత్రికలు, టీవీని వదిలేసి డిజిటల్ మీడియా వైపు మళ్లుతున్నారని నివేదిక చెప్పింది. ఎన్నికల సమయంలో మాత్రం ప్రేక్షకులు ఇంకా టీవీ పట్ల ఆసక్తి చూపిస్తున్నారని, మిగిలిన సమయాల్లో డిజిటల్ మీడియా ముఖ్యంగా మొబైల్ ఫోన్లలో వస్తోన్న సమాచారం మీదనే ఆధారపడుతున్నారని ఆఫ్కాం తేల్చింది. నిజానికి కొన్ని ఇతర సంస్థలు చేసిన సర్వేలలో తేలిందేమంటే దినపత్రికల ఆన్‌లైన్ వెబ్‌సైట్లను కూడా జనం చూడడం లేదు. సోషల్ మీడియానే నమ్ముకుంటున్నారు.




### ఆదాయం కోసం అరవై మార్గాలు!

2018లో వార్తలు చూడడానికి సంప్రదాయబద్ధంగా దినపత్రికల వెబ్‌సైట్లను చూసేవారి సంఖ్య 22 శాతముండేది. ఇప్పుడది 10 శాతానికి పడిపోయింది. మరి వారు వార్తలు ఎక్కడ తెలుసుకుంటున్నారు? ఎక్కువగా యువపాఠకులు వార్తల కోసం తక్కువ నిడివిగల వీడియో కంటెంట్ వైపు మరలుతున్నారని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన రాయిటర్స్ సంస్థ సర్వేలో తేలింది. అందులోనూ యువతరం పెద్ద సంఖ్యలో టిక్‌టాక్ (మన దేశంలో బ్యాన్ చేశారు), యూట్యూబ్ న్యూస్‌పైన ఆధారపడుతున్నారని ఈ సర్వే చెప్పింది. పెద్ద పెద్ద వార్తాసంస్థల కంటే సోషల్ మీడియా ప్రభావశీలురు (ఇన్‌ఫ్లూయెన్సర్లు) మంచి కంటెంట్ అందిస్తున్నారని దాదాపు 47 దేశాలకు చెందిన యువతీయువకులు అభిప్రాయపడ్డారు. మీకు తెలిసిన 30 ఏళ్లలోపు యువతరాన్ని ఎవరినైనా అడగండి, వారీమధ్య ఏదైనా దినపత్రికను చేతితో పట్టుకుని చదివారేమో? జడ్ జెన్ (ఇప్పుడు 18 నుంచి 26 ఏళ్లు ఉన్న యువతరం) పిల్లలలో మూడింట రెండు వంతుల మందికి ప్రధానంగా వార్తలు లభించే చోటు సోషల్ మీడియానే. అందులో ఎక్కువగా ఇన్‌స్టాగ్రామ్‌పై ఆధారపడుతున్నారు. తెలివిగల దినపత్రికలు ఇప్పుడు అన్నీ తమను తాము మార్చుకుని డిజిటల్ అవతారానికి తరలిపోతున్నాయి. టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, తదితర సోషల్ మీడియా చానెళ్లలోకి దూరుతున్నాయి. నెమ్మదిగా వ్యాపార ప్రకటనలను పట్టుకుంటున్నాయి.

ఒక ఉదాహరణగా ఆస్ట్రేలియాను తీసుకుంటే మర్డోక్‌కు చెందిన స్కై గ్రూపు 2023లో 490 వాయిస్ యూట్యూబ్ వీడియోలు విడుదల చేసి, 9 మిలియన్ ప్రేక్షకులను చేరుకుంది. వారి ప్రత్యర్థి గార్డియన్ సంస్థ 110 వాయిస్ వీడియోలను యూట్యూబులో పెడితే 1.6 మిలియన్ వ్యూస్ దక్కాయి. దాంతో పత్రికలు తమ ఆదాయాన్ని ఆర్జించడానికి రెవిన్యూ మార్గాలను విస్తరించుకున్నట్టు తెలుతోంది. ప్రకటనలు, చందాలు కట్టించుకోవడం, విరాళాలు సేకరించడం, కొన్ని కార్యక్రమాలు నిర్వహించడం, డేటా అమ్మడం, ప్రభుత్వం నుంచి నిధులు సేకరించడం వంటి అదనపు ఆదాయ మార్గాల వైపు మళ్లారు. 2021లో పరిచయమైన ఎన్ఎంబిసి (న్యూస్ మీడియా బార్గెయినింగ్ కోడ్) ఇప్పుడు పెద్ద ఎత్తున డిజిటల్ మీడియాకు ఆదాయ




దన్నుగా నిలుస్తోంది. అంటే గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ ఎడ్జ్ మనం తెరవగానే కొన్ని వార్తలు కనిపిస్తున్నాయి కదా. అలా అవి చూపించిన వార్తలకు కొంత సొమ్మును ఆయా వార్తా సంస్థలకు రాయల్టీగా చెల్లించడం మొదలైంది. ఫేస్‌బుక్ మొదటి మూడు సంవత్సరాలు ఇలా డబ్బు చెల్లించి, తర్వాత చేతులెత్తేసింది. దీనిమీద ఇంకా వార్తాసంస్థలు పోరాడుతున్నాయి. మన దేశంలో ది హిందూ గ్రూపు తన పత్రికలన్నింటినీ డిజిటల్ రూపంలోకి తీసుకొచ్చింది. అవి మనం చూడాలంటే చందా రూపంలో కొంత సొమ్ము చెల్లించవలసిందే. ఇప్పుడిప్పుడే టైమ్స్ ఆఫ్ ఇండియా కూడా ఇదే బాట పడుతోంది. అయితే బ్రాండ్ వాల్యూ బట్టే పాఠకులు డబ్బులు చెల్లిస్తారని మనకు తెలిసిందే. న్యూయార్క్ టైమ్స్ పత్రికకు పది మిలియన్ల చందాదారులు ఉన్నారు. ప్రతి నెలా ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం కంటే చందాల ద్వారానే ఎక్కువ ఆదాయం వారికి వస్తుంది.

### మన తెలుగు పత్రికల భవిష్యత్తు ఏమిటి?

అయితే ఇతరేతర కారణాల వలన మర్డోక్ ఇప్పటివరకూ తన పత్రికలకు చందాలు పెట్టలేకపోయాడు. ఇప్పటికీ ఆన్‌లైన్ పత్రికలు ఉచితంగానే పాఠకులు చదవగలుగుతున్నారు. అంటే ఆ సంస్థకు కేవలం ప్రకటనల ఆదాయం మాత్రమే రాబడి. ఇప్పుడే పులిమీద పుట్రలా కృత్రిమ మేధ దినపత్రికల ఆఖరి ఉసురు తీయడానికి సిద్ధమైనట్టు కనిపిస్తోంది. దానిని కూడా పెద్ద మీడియా సంస్థలు వార్తల సృష్టికి వాడుతున్నప్పటికీ ఆదాయం పెంపుదలకు జనరేటివ్ ఎఐ ఎలా తోడ్పడుతుందో ఇంకా స్పష్టంగా తేలలేదు. మర్డోక్ భయపడుతున్నట్టు పత్రికలు పూర్తిగా మాయమవుతాయని చెప్పలేము గాని, పత్రికల భవిష్యత్తు మాత్రం అగమ్యగోచరంగానే ఉంది. ఈ నేపథ్యంలో మన తెలుగు దినపత్రికల భవిష్యత్తు ఎలా ఉండబోతున్నదీ మనం అంచనా వేయలేం. ఎందుకంటే మన తెలుగు దినపత్రికలకు అటు అవి చదువుతున్న పాఠకులలో, ఇటు సాధారణ ప్రజలలో విశ్వసనీయత కొరవడింది. అవి అనివార్యంగా రాజకీయ అభిప్రాయాలకు మొగ్గు చూపుతున్నట్టు కనిపించడం విషాదం. ఒకవైపు వాటి మనుగడే ప్రశ్నార్థకం అవుతున్న విపత్కర పరిస్థితిని అవి పట్టించుకున్నట్టు కనిపించడం లేదు. తమ రాజకీయ అభిప్రాయాలు చలామణి కావడానికి, పాఠకులు తమ పత్రికలు కొనకపోయినా, అవి ఉచితంగా పంపిణీ చేయడానికి సిద్ధపడడం మొన్నటి ఎన్నికలలో మనం చూసాం.

- దుప్పల రవికుమార్

# ఎందుకిట్లా ఆడుకున్నావ్ రాధికా!

(మొదటిపేజీ తరువాయి)

ఆధారాన్ని ఏడాది కావస్తున్నా ఇంతవరకు పోలీసులు సంపాదించలేకపోయారు. అందుకే ఛార్జిషీట్ కూడా ఇప్పటి వరకు పడలేదు. స్వప్నప్రియ బ్యాంకు నుంచి బంగారం తీసుకువెళ్లి సోదరుడికి ఇచ్చిందన్న ఒక్క ఆధారాన్ని కూడా పోలీసులు ఇప్పటి వరకు సంపాదించలేదు. ఆ మాటకొస్తే బ్యాంకులో ఉన్న బంగారం మాయమ వడం వెనుక కుట్ర ఏమిటో స్వప్నప్రియ సోదరుడు కిరణ్ తన తల్లితో కలిసి ఎస్పీకి ఆధారాలు సమర్పించిన రోజే ఈ కేసుకు సంబంధించిన మిస్టరీ వీడిపోయింది. అక్కడి నుంచే పోలీసుల ఆలోచన మరో రూట్‌లో వెళ్లింది. ఇన్ని లక్షలు విలువైన బంగారాన్ని బ్యాంకు కాంపౌండ్ దాటించేసినవారిని పిలిచి బేరమాడితే పెద్ద ఎత్తున సొమ్ములొస్తాయన్న ఆలోచనకు బీజం పడింది. అందులో భాగంగానే కిరణ్ ఇచ్చిన ఆధారాల మేరకు అప్పటి ఆర్ఎం టీఆర్ఎం రాజు గ్యాంగ్‌ను పిలిచి బేరం కుదుర్చుకున్న పోలీసులు పెద్ద మొత్తంలో సొమ్ములు తీసుకొని స్వప్నప్రియ సోదరుడి మీదకు కేసు నెట్టేశారు. కులపరంగా మైనార్టీ కావడం, రాజకీయ, పోలీసు ప్రాపకం లేకపోవడంతో ఈ కేసులో కిరణ్‌ను బలిపశువును చేసి తప్పుకోవచ్చని పోలీసులు భావించారు. ఈ ప్రాసెస్‌లో తప్పు మీద తప్పు చేసుకుంటూపోయారు.

20 సెల్‌ఫోన్లో, 15 ద్విచక్ర వాహనాలో దొంగిలించిన వ్యక్తి దొరికితే ముసుగులేసి మరీ మీడియా ముందు ప్రవేశపెట్టే పోలీసులు గార బ్యాంకు కుంభకోణాన్ని ఛేదించామంటూ విలేకరుల సమావేశం పెట్టినప్పుడు కిరణ్‌ను మీడియా ముందు ప్రవేశపెట్ట లేదు. ఇందుకు ఒక బలమైన కారణం ఉంది. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి ఆధారాలు ఉండి శిక్ష తప్పదు అన్న కేసుల్లోనే నిందితుడ్ని మీడియా ముందు చూపించాలి. కానీ అప్పటికే తాము అరెస్ట్ చేసిన వ్యక్తి నిందితుడు కాదని పోలీసులకు తెలుసు. అందుకే మీడియా అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానాలు చెప్పకుండా ఆ ప్రెస్‌మీట్‌ను అర్ధాంతరం గా ముగించేశారు. ఈ కథ చదువుతుంటే ముంబయి నటి జెత్వానీ కథ లాంటిదే అంతకు క్రితం శ్రీకాకుళం లో జరిగిపోయిందనిపిస్తే ఆ తప్పు మనది కాదు. పోలీసు బుర్రలన్నీ ఒకేలా ఉంటాయనడానికి నిదర్శనం. గార ఎస్బీఐ వ్యవహారంలో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా ఉన్న అప్పటి సీఐ నాయుడుకి ఈ వ్యవహారంలో ఉన్నతాధికారుల తీరు ఏ రోజుకైనా పీకకు చుట్టుకుంటుందని తెలుసు. ఎందుకంటే.. శ్రీకాకుళం వన్‌టౌన్‌తో పాటు గార పోలీస్‌స్టేషన్‌కు కూడా ఆయనే సీఐ. ప్రాథమిక ఇన్వెస్టిగేషన్ ఆయనే నిర్వహించారు. ఎప్పుడైతే ఈ కేసు తప్పుదారి పడుతుందని తెలుసుకున్నారో ఆయన అప్పటికప్పుడు లాంగ్‌లీవ్ పెట్టి వెళ్లిపోయారు. దీంతో గార ఎస్ఐగా ఉంటూ సీఐగా పదోన్నతి పొందిన కామేశ్వరరావు ఈ కేసును డీల్ చేశారు. గార ఎస్ఐగా పని చేసిన సమయంలో కామేశ్వరరావు చేయని పాపం లేదు. శ్రీకూర్మంలో వైకాపా నాయకుడు రామశేషు హత్య కేసును పూర్తిగా నీరుగార్చేయడానికి కామేశ్వర రావు పెద్ద ఎత్తున సొమ్ములు తీసుకున్నారని అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. రామశేషును హత్య చేసింది ఎవరన్న విషయం గార పోలీసుల విచారణలో ముందే తేలిపోయినా నిందితులను తప్పించడం కోసం పెద్ద ఎత్తున సొమ్ములు తీసుకొని స్థానిక తెలుగుదేశం నేతల మీదకు ఈ కేసును నెట్టేయాలని ప్రయత్నించారన్న ఆరోపణ ఆయనపై ఉంది. అయితే అప్పటి మంత్రి ధర్మాన ప్రసాదరావుకు శ్రీకూర్మం స్థానికులు ఈ విషయం చేరవేయడంతో తెలుగుదేశం నాయకులు బతికిపోయారు. అలాగే గార పరిధిలో జరిగిన నేరాలు, ఘోరాల్లో అసలైన నిందితులను తప్పించి గతంలో క్రైమ్ రికార్డుల్లో ఉన్న వేరే మండలాలకు చెందిన కొందర్ని తీసుకువచ్చి అరెస్ట్ చూపించిన ఘటనలు కామేశ్వరరావు సర్వీసులో కోకొల్లలు అని చెప్పుకుంటారు. శ్రీకాకుళం లా అండ్ ఆర్డర్ డీఎస్పీగా శృతి పనిచేసిన రోజుల్లో కామేశ్వరరావుకు సంబంధించిన తలనొప్పులు తీర్చడానికే రోజంతా సరిపోయేదన్న టాక్ ఆ డిపార్ట్ మెంట్‌లో ఉంది. అలాంటి కామేశ్వరరావు నేరుగా అప్పటి ఎస్పీకి ఈ వ్యవహారంలో లాభనష్టాలు చెప్పడంతో కథ మొత్తం తిప్పేశారు. దీనికి తోడు డిపార్ట్‌మెంట్‌లో అప్పటి ఎస్పీకి గాడ్‌ఫాదర్‌గా వ్యవహరించిన డీజీ స్థాయి అధికారి కూడా ఈ కేసులో ఎస్‌బీఐ ఆర్ఎం టీఆర్ఎం రాజు తరఫున రికమండ్ చేయడంతో స్వామికార్యం, స్వకార్యం రెండూ పూర్తవుతాయన్న కారణంతో స్వప్నప్రియ కేసును స్వయంగా ఆమె కుటుంబ సభ్యుల మీదకే నెట్టేశారు. బ్యాంకులో తాకట్టులో ఉండాల్సిన బంగారం యథావిధిగా ఉందని ఎప్పటికప్పుడు ఆడిటింగ్ డిపార్ట్‌మెంట్ రిపోర్టు ఎలా ఇచ్చిందని, ఇప్పుడు పోయిందని టీఆర్ఎం రాజు పోలీసులకు ఎలా ఫిర్యాదు చేశారన్న అనుమానం బ్యాంకు వైపు నుంచి అప్పటి చీఫ్ జనరల్ మేనేజర్‌కు వచ్చింది. టెక్నికల్‌గా ఇది అత్యంత విలువైన ప్రశ్న. ఈ ఒక్క కారణంతోనే టీఆర్ఎం రాజును బాధ్యుడ్ని చేస్తూ ఉద్యోగం తొలగించొచ్చు. కానీ దొంగలెవరో పోలీసులు కనిపెట్టారని, ఆ మేరకు రిమాండ్‌కు కూడా పంపారనే ఒక కాగితం చూపిస్తూ మరోసారి డీజీ స్థాయి వ్యక్తితో అప్పటి సీజీఎంకు చెప్పించడంతో ఆయన భయపడిపోయి ఈ కేసులో ఈ కోణం విడిచిపెట్టేసినట్లు తెలుస్తుంది. ఎన్నిసార్లు ఆడిట్ జరిగినా, ఎంతమంది అధికారులు వచ్చినా లాకర్‌లో బంగారం సేఫ్‌గా ఉందని రిపోర్టు ఇచ్చారంటే అది రీజనల్ మేనేజర్ స్థాయిలో మేనేజ్ చేస్తే గానీ కుదరదు. ఇక జెత్వానీ కేసుతో సరితూగే మరికొన్ని అంశాలు ఇక్కడ మనకు కనిపిస్తున్నాయి. ఎలుకల మందు తాగి స్వప్నప్రియ ఆత్మహత్యకు ప్రయత్నించిన తర్వాత శ్రీకాకుళం మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ సమయంలో ఎస్‌బీఐ నుంచి ఇద్దరు అధికారులు వచ్చి మంచం మీద ఉన్న ఆమె వద్ద నుంచి కొన్ని సంతకాలు తీసుకొని వెళ్లిపోయారు. స్వప్నప్రియ ఎలుకల మందు తాగి రోజులు గడవడం, కడుపునొప్పి తీవ్రం కావడంతో ఆత్మహత్యాయత్నం విషయం బయటపెట్టింది. దీంతో ఆగమేఘాల మీద మెడికవర్‌లో చేర్పించి ఓవైపు తప్పి, మరోవైపు సోదరుడు హడావుడిగా తిరుగుతుంటే ఐడీ కార్డులు వేసుకొచ్చి మరీ ఇద్దరు అధికారులు స్వప్నప్రియ నుంచి సంతకాలు తీసుకున్నారు. పోనీ బ్యాంకు సొమ్ములతో ట్రీట్మెంట్ ఇప్పించడం కోసం సంతకాలు తీసుకున్నారా అంటే మెడికవర్‌కు స్వప్నప్రియ కుటుంబమే సొమ్ములు చెల్లించింది. అలా అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు సంతకాలు తీసుకోవడం వెనుక కూడా ఓ కుట్ర ఉంది. స్వప్నప్రియ చనిపోయిన తర్వాత పరామర్శకు ఎవరు వెళ్లినా వారి మీద కూడా కేసు పెట్టిస్తానని టీఆర్ఎం రాజు బెదిరించారని వినికిడి. అప్పటి పోలీసుల నుంచి ఎంత సహకారం లేకపోతే టీఆర్ఎం రాజు ఇంత విచ్చలవిడిగా భయపెట్టగలుగుతారు. గార బ్యాంకు కుంభకోణం జరిగినప్పుడు ఉన్న స్టాఫ్ మొత్తాన్ని మార్చేసి పోలీసు విచారణకు ఎవర్నీ అందుబాటులో లేకుండాచేసిన టీఆర్ఎం రాజు, అప్పటి పోలీసు అధికారులు చేసిన హత్య ఇది.

## బ్రెయిన్ ఇంజురీ బాధితునికి ఆర్థిక సాయం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

సింగుపురం గ్రామానికి చెందిన దాసరి వినయ్ కుమార్‌కు ఇటీవల జాతీయ రహదారి కోమర్తి జంక్షన్ వద్ద లారీ ఢీకొని తలకు గాయమైంది. ప్రస్తుతం కిమ్స్ వైద్యశాల ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. పరీక్షించిన వైద్యులు తలకు బలమైన గాయమైందని, రూ.4 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఈ చికిత్సకు ఆరోగ్యశ్రీ వర్తించదని, తండ్రి కూడా చనిపోయారని, కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావటంతో వినయ్ తల్లి గ్రామస్థుల సహకారంతో సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితిని సంప్రదించారు. స్పందించిన సంస్థ సభ్యులు మిత్రులు, దాతలు అందించిన సహకారంతో బుధవారం కిమ్స్ వైద్యశాలకు వెళ్లి రూ.17వేలు ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు పొడుగు అవినాష్, బరాటం చంద్రశేఖర్, ఉర్లం శివతేజ, కలివరపు సూర్యప్రకాష్, బాధితుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్‌కు మినరల్ వాటర్ ప్లాంట్ వితరణ

(సత్యంన్యూస్, నరసన్నపేట)



జలుమూరు మండలం కరవంజ గ్రామంలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు గత కొన్నేళ్లుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని ఎస్ అండ్ పి గ్లోబల్, ఐఎన్ని, సీఎస్ఆర్ ఆక్టివిటీ ద్వారా ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో అందించారు. ఎస్ అండ్ పి గ్లోబల్, ఐఎన్ని సేవలను ఎంఈఓ ఎం.వి.ఆర్.ప్రసాద్ రావు కొనియాడారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ గ్లోబల్ వాలంటీర్ వీక్‌లో భాగంగా యునైటెడ్ వే అఫ్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో సుమారు రూ.3 లక్షలు విలువ గల ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను అందించటం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల ఆహ్లాద వాతావరణం కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామని, ఎస్ అండ్ పి గ్లోబల్, ఐఎన్ని ఎన్నో సంవత్సరాల నుంచి ఇలాంటి సేవా కార్యక్రమాల్ని ప్రపంచంలో ఉన్న తన కంపెనీ శాఖల ద్వారా చేపట్టిందని, ఈ గ్లోబల్ వాలంటరీ వీక్ ద్వారా 200 కార్యక్రమాలు వివిధ దేశాల్లో మహోన్నత యజ్ఞంగా చేపట్టి, 1000 మందికి పైగా వాలంటీర్లతో చేస్తుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో బి.మాధవరావు, వాసుదేవరావు, వినోద్, కంపెనీ ప్రతినిధులు వరప్రసాద్, అశోక్ కుమార్, యోగానంద చారి, శ్రీధర్, లక్ష్మీకుమారి, వెంకట శివ, జైరాజ్, ప్రజా ప్రతినిధులు యాబాజీ చంద్రశేఖర్, క్రాంతి కుమార్, పెద్దిన చిరంజీవి, కూర్మారావు, సింహాచలం, జిఎంఆర్, మల్లేశ్వరరావు, శివ గణేష్, తేజేశ్వరరావు, గ్రామ సర్పంచ్ నేతాజీ, అప్పలనాయుడు, మురళీధర్ రావు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, పంచాయతీ పెద్దలు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.